క్లుప్తంగా

కె.కె. రాజుకు అభినందన



కె.కె. రాజును అభినందిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన కె.కె. రాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ షరీఫ్, బీసీ సెల్ సిటీ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు తాడి రవితేజ, శివ తదితరులు కె.కె. రాజుకు బొకే అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులను సంఘటిత పరిచి పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేలా అందరూ పని చేయాలని అభిప్రాయపడ్డారు.

తెలుగింటి ఆణిముత్యం డీవీ



మాజీ మేయర్ డీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవికుమార్

దాబాగార్డెన్స్: తెలుగింటి ఆణిముత్యం డీవీ సుబ్బారావు అని శ్రీగాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, ప్రకృతి చికిత్సాలయం ప్రతినిధి రూపాకుల రవికుమార్ పేర్కొన్నారు. డీవీ సుబ్బారావు 93వ జయంతి గురువారం మహారాణిపేటలో గల అకాడమీ ప్రాంగణంలో నిర్వహించారు. ముందుగా డీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ దుర్వాసుల వెంకట సుబ్బారావు న్యాయవాదిగా, రాజకీయవేత్తగా, క్రికెట్ నిర్వాహకుడిగా రాణించారన్నారు. 1987 నుంచి 1992 వరకు విశాఖ మేయర్‌గా సేవలందించారని తెలిపారు. రెండు సార్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చైర్మన్‌గా ఎన్నికయ్యారని, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, శ్రీలక్ష్మి, రాము, రమణ, మంగ, బంగారమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయ వసతిగృహానికి అభాగ్యుల తరలింపు



డిశ్చార్జి అయిన రోగులతో ఏయూటీడీ వాసు

సీతమ్మధార: చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకున్న అయిదుగురు పురుషులు, ఇద్దరు మహిళలను గురువారం డిశ్చార్జి చేశారు. వీరిని ద్వారకానగర్‌లోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ జీవీఎంసీ నిరాశ్రయ వసతిగృహాలకు తరలించారు. వీరిని కుటుంబ సభ్యులు తీసుకెళ్లడానికి రాకపోవడంతో ఏయూటీడీ సంస్థ స్వచ్ఛందంగా వీరికి ఆశ్రయం కల్పించింది. వారిచేత మందులు వాడిస్తూ, పూర్తి వివరాలు తెలుసుకుని శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నట్లు ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు శ్రద్ధా సోషల్ వర్కర్లు గౌతం, హరీష్ పాల్గొన్నారు

మనతోనే మలేరియా అంతం



- గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేరువైన వైద్య సేవలు
- నివారణ చర్యలతో తగ్గుతున్న ఉధృతి
- దోమల నియంత్రణపై అవగాహన అవసరం
- నేడు ప్రపంచ మలేరియా డే



దోమల నియంత్రణకు ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: చలితో కూడిన జ్వరం మలేరియాకు సంకేతం. రక్త పరీక్షలో మలేరియా అని నిర్ధారణ అయితే మూల చికిత్స సకాలంలో వాడకుంటే మరణానికి చేరువయినట్టే. అంతటి ప్రాణాంతకమైన జ్వరం మలేరియా. గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా వణికించిన మలేరియా జ్వరాలు కొన్నేళ్లుగా వైద్యారోగ్యశాఖ అనుసరిస్తున్న నియంత్రణ చర్యలతో తగ్గుముఖం పడుతున్నాయి. 2027 నాటికి మలేరియాను అంతం చేసే దిశగా ప్రత్యేక ప్రణాళికతో వైద్య ఆరోగ్య శాఖ ముందుకు సాగుతోంది. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం డే.

ప్రతి ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు మలేరియ జ్వరాలు సంభవించే అవకాశం ఉంది.

సబ్ యూనిట్ పరిధిలో మలేరియా పాజిటివ్ కేసుల వివరాలివి

సంవత్సరం	మలేరియా	సంవత్సరం	మలేరియా
2022	42	2024	71
2023	84	2025	25
		(ఏప్రిల్ 24 వరకు)	

ఒకప్పుడు పదుల సంఖ్యలో మలేరియా కేసులు నమోదయ్యేవి. నగరంలో కొన్నేళ్లుగా మలేరియా పాజిటివ్ కేసుల సంఖ్య బాగా తగ్గుముఖం పట్టింది. దానికి ప్రధాన కారణం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాలు, మెరుగైన మౌలిక సదుపాయాలతో వైద్య సేవలు చేరువ చేయడం. సచివాలయం ఒక యూనిట్‌గా, ప్రతి సచివాలయం పరిధిలో ఒక ఏఎన్ఎం, ఆశ కార్యకర్త ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. సచివాలయ వ్యవస్థ ద్వారా హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్యలు, జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం సమన్వయంతో ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డే డ్రైడే పటిష్టంగా నిర్వహించి దోమల పెరుగుదలను నియంత్రించారు. ఫలితంగా ఆడ ఎనాఫిలస్ దోమ ఉధృతి తగ్గడంతో.. మలేరియా బారినపడే వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది.



విద్యార్థులకు మలేరియాపై అవగాహన కల్పిస్తున్న అధికారి నగేష్ పట్నాయక్



నీటి నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసి

దోమల నియంత్రణపై అవగాహన



2020 నుంచి ఇప్పటి నగరంలో మలేరియా బారినపడే వారి సంఖ్య తగ్గింది. దోమల నియంత్రణకు ప్రతి సచివాలయం పరిధిలో శుక్ర, మంగళ వారాల్లో డ్రై డే నిర్వహిస్తున్నాం. హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు, జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బంది, జిల్లా మలేరియా విభాగం సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి దోమల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నాం. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా జ్వరాలను వ్యాప్తి చేసే దోమలను అరికట్టాలంటే ప్రజల సహకారం తప్పనిసరి. ఇంటిలోపల, చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూడడం ద్వారా దోమలను నియంత్రించవచ్చు.

– నగేష్ పట్నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్, మలేరియా విభాగం

మలేరియాపై పోరు

ఏటా ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా డే నిర్వహిస్తున్నారు. దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతకమైన మలేరియా జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, దోమ కాటు బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు వహించాలి తదితర అంశాలపై అవగాహన ర్యాలీలు, ఎగ్జిబిషన్లు, సమావేశాలు నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేస్తుంటారు. ఈ ఏడాది కూడా 'మలేరియా అంతం మనతోనే' అనే థీమ్‌తో మలేరియా డేను నిర్వహిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియాను అంతం చేయవచ్చని, అందరిలో మార్పు వస్తే మలేరియా అంతం సాధ్యమని ఈ థీమ్ ఉద్దేశం. వ్యాధి మూలాలను గుర్తించి.. నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా 2027 నాటికి మలేరియాను అంతమొందించాలన్న లక్ష్యంతో జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం ముందుకు సాగుతున్నాయి. ప్రతి సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని గత మూడేళ్లలో నమోదైన మలేరియా కేసుల సంఖ్యను బట్టి ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో మలేరియాను అదుపు చేయడానికి ప్రణాళికలు రూపొందించారు.

మలేరియా అంతం దిశగా అడుగులు



దోమలు పెరగకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలి. తాగి పారేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, రుబ్బురోళ్లు, మనీప్లాంట్లు, రిఫ్రిజిరేటర్లు, కూలర్లు దోమలు ఉత్పత్తి చెందే వనరులు. ప్రతి మూడు రోజులకు ఒక సారి వాటిలో నీటిని ఖాళీ చేయాలి. జిల్లాలో మొదటి విడతలో దబ్బంద, ఎన్‌జీఆర్ పురం, గంభీరం, చిన ఉప్పాడలో దోమలు మందు పిచికారీ చేయనున్నాం. అలాగే 75 వసతి గృహాల్లో జూన్ 15 నుంచి పిచికారీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ప్రజలు దోమ తెరలు వాడాలి. మలేరియా బారినపడకుండా అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

సెలవులపై వింత రూల్స్

- సెలవు పెడితే అవసరం లేని అధికారులకు చెప్పాలట
- కేజీహెచ్ సూపరింటెండెంట్ ఉత్తర్వులపై ఉద్యోగుల ఆగ్రహం

దాబాగార్డెన్స్ : కేజీహెచ్‌లో రోజుకో వింత రూల్ పుట్టుకొస్తుంది. ఈ రూల్స్‌తో ఉద్యోగులు, సిబ్బంది సతమతమవుతున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించే విషయంలో దృష్టి పెట్టని ఉన్నతాధికారులు.. పరిపాలన విభాగంలో లేనిపోని విధానాలు తెరపైకి తీసుకొచ్చి మానసికంగా వేధిస్తున్నారంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ జారీ చేసిన ఉత్తర్వు మినిస్టీరియల్ ఉద్యోగుల్లో కలకలం రేపుతోంది. వాస్తవానికి ఏదైనా కార్యాలయంలో ఉద్యోగి సెలవు పెడితే ఆయా విభాగానికి సంబంధించిన ఉన్నతాధికారి నుంచి అనుమతి తీసుకుంటే సరిపోతుంది. పై స్థాయి అధికారులకు ఆ సమాచారం అందించాల్సిన అవసరం ఉండదు. కేజీహెచ్‌లో మినిస్టీరియల్ సిబ్బంది అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పరిధిలో ఉంటారు. కార్యాలయంలోని మేనేజర్ సంతకంతో పాటు ఏడీ సంతకం తీసుకుని సెలవుకు వెళ్తే సరిపోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో ఇదే విధానం అమలవుతోంది. కేజీహెచ్‌లో మాత్రం కింది స్థాయి ఉద్యోగి సెలవు పెడితే సూపరింటెండెంట్ అనుమతి తీసుకోవాలంటూ వింత రూల్ అమలు చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇనాం భూములపై హైకోర్టు తీర్పు అమలుకు వినతి

దాబాగార్డెన్స్: విశాఖ రూరల్ మండలం రుషికొండ అగ్రహారం, సంగివలస అగ్రహారం ఈనామ్ భూములపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఈనాందార్లు టీవీ సాయికుమార్ గురువారం కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రుషికొండ అగ్రహారం టీడీ నంబరు 1254 పరిధిలోకి వచ్చే భూములకు సంబంధించి ఈనాందారులే అర్హులంటూ గతంలో ఈనామ్ డీటీ ఇచ్చిన తీర్పుపై జిల్లా యంత్రాంగం హైకోర్టులో దరఖాస్తు చేసిందన్నారు. ఈ భూములు ఈనాందారులమైన తమవే అంటూ హైకోర్టు తీర్పు ఇచ్చిందని, తీర్పును జిల్లా యంత్రాంగం అమలు చేయాలని కోరారు. రుషికొండ అగ్రహారం, సంగివలస అగ్రహారం భూములు తమ తాత ముత్తాతల నుంచి తమ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ భూమిపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసి, తమకు న్యాయం చేయాలని, ఈ మేరకు ఆర్డీవోకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

వాసుపల్లి దాతృత్వం

- వైఎస్సార్‌సీపీ సోషల్ యాక్టివిస్ట్‌కు అండగా వాసుపల్లి
- కోర్టు ఖర్చులకు రూ.5 వేలు అందజేత



శ్యామ్‌కు ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. ఇటీవల గుడివాడకు చెందిన పార్టీ సోషల్ యాక్టివిస్ట్ నక్కెళ్ల శ్యామ్ కూటమి నేతలపై తప్పుడు ప్రచారం చేశారనే అభియోగంతో అతనిపై విశాఖలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. సమాచారం తెలుసుకున్న వాసుపల్లి గణేష్‌కుమార్ స్థానిక నాయకులు, కార్యకర్తలకు సమాచారమిచ్చి అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. వారిని స్టేషన్‌కు పంపించి, చొరవ తీసుకుని అతన్ని బయటికి తీసుకొచ్చారు. 104 ఏరియాలోని తన కార్యాలయంలో కోర్టు ఖర్చుల కింద గురువారం రూ. 5 వేలు నక్కెళ్ల శ్యామ్‌కు అందజేశారు.

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు..

మంచి పాలన అందించాలని ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెడితే ఈ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలే టార్గెట్‌గా పాలన సాగిస్తుందని వాసుపల్లి గణేష్‌కుమార్ మండిపడ్డారు. నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తూ అక్రమంగా అరెస్టులు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సరికాదన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, పరిస్థితులు ఒకేలా ఉండవని, తప్పకుండా వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని వాసుపల్లి తెలిపారు. పోలీసులు కూడా కూటమి నేతలు చెప్పినట్టు కాకుండా ధర్మంగా వ్యవహరించాలన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య



చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీసీ, ఆసరా సంస్థ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: కశ్మీర్ ఉగ్రదాడిలో మృతి చెందిన విశాఖ వాసి చంద్రమౌళికి వీసీసీ, ఆసరా సంస్థల సభ్యులు ఘన నివాళులు అర్పించారు. గురువారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, ఆసరా చారిటబుల్ సొసైటీలు చంద్రమౌళికి నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా వీసీసీ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె. రమాప్రభ మాట్లాడుతూ చంద్రమౌళి సేవలు గుర్తు చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పని చేస్తున్నప్పటి నుంచి ఆసరా చారిటబుల్ సొసైటీలో సభ్యుడిగా ఉంటూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారన్నారు. ఆసరా చారిటబుల్ సొసైటీ ఈసీ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రమౌళి సేవలు ఎనలేనివని, మారుమూల గిరిజన ప్రాంతాల్లో పర్యటించి సేవలందించేవారని తెలిపారు. విద్యార్థులకు అనేక సలహాలు, సూచనలు ఇవ్వడమే కాక, ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రోత్సాహం అందించేవారని తెలిపారు. కరోనా సమయంలో మహిళల కోసం ఆసరా ద్వారా కుట్టు శిక్షణ కేంద్రాలు నెలకొల్పడంలో కృషి చేశారన్నారు. వీసీసీ విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సహాయం చేశారన్నారు. ఉగ్రవాదులు దుర్మార్గంగా ఆయనను కాల్చి చంపడం అత్యంత అమానవీయమని, హేయమైన చర్య అని ఖండిస్తూ మౌనం పాటించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆసరా ఈసీ సభ్యులు సుధ, శోభ, వీసీసీ సభ్యురాలు సుశీల తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో..

పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి స్వామి వివేకానంద సంస్థ గురువారం సాయంత్రం ఘనంగా నివాళులర్పించింది. దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తూ.. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతూ కాగడాలు వెలిగించి జాతీయ జెండాతో నివాళులర్పించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, ఉమ్మడి రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ ఉగ్రదాడిని ఖండించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు, ట్యూషన్ పిల్లలు పాల్గొన్నారు.



కాగడాలతో నివాళులర్పిస్తున్న డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ తదితరులు

ఎల్ఐసీ ఉద్యోగుల నివాళి..

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఎల్ఐసీ ఉద్యోగులు గురువారం సాయంత్రం ఎల్ఐసీ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఎల్ఐసీ క్లాస్–1 ఆఫీసర్స్ ఫెడరేషన్, ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యూఐ క్లాస్–2 ఆఫీసర్స్ ఫెడరేషన్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, ఎల్ఐసీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్, ఎల్ఐసీ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్, ఐసీఆర్ఈఏ (రిటైర్డ్ ఉద్యోగుల యూనియన్), ఏవోఐ (ఏజెంట్ల యూనియన్), ఎల్ఐఏఎఫ్ఐ విశాఖపట్నం డివిజన్‌తో పాటు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



ర్యాలీగా వస్తున్న భవన నిర్మాణ కార్మికులు

- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భవన నిర్మాణ కార్మికుల నిరసన

సీతమ్మధార: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం ద్వారకా నగర్ జంక్షన్ గురజాడ అప్పారావు విగ్రహం నుండి లలితా జ్యూయలరీ, ఆశీలమెట్ట జంక్షన్ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ తీసి అనంతరం జీవీఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైయిమ్‌లన్నీ చెల్లించాలని, కొత్త కార్డులు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, కార్మికులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం కావస్తున్నా ఇంత వరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం అన్యాయం అన్నారు. భవన నిర్మాణ కార్మికుల నిధులను వారి అభివృద్ధి కోసమే ఖర్చు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సంక్షేమ బోర్డును గనుక పునరుద్ధరించకపోతే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు బలివాడ వెంకట్రావు, అధ్యక్షులు పి.అనసూయ, ప్రధాన కార్యర్శి బి.శ్రీనివాసరావు, కుమార్, నాయకులు రామునాయుడు, రాజశేఖర్, నాగేష్, రమణ, నర్సింగరావు, మసేన్, పెంటారావు, ఈశ్వరావులతో పాటు మహిళలు, పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులు



పోప్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ తదితరులు

కంచరపాలెం: ప్రపంచ క్రైస్తవ నాయకులు పోప్ ఫ్రాన్సిస్ మరణానికి చింతిస్తూ జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ పార్టీ కార్యాలయంలో గురువారం నివాళులు అర్పించారు. విశ్వ క్యాథలిక్ సంఘ కాపరి, యావత్ క్రైస్తవ లోకానికి మార్గదర్శి పోప్ ఫ్రాన్సిస్ మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రపంచం ఒక గొప్ప శాంతి దూతను కోల్పోయిందని ఆయన ఆత్మకు దేవుడు శాంతి ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. శనివారం వాటికన్ నగరంలో భూస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేళంగిణీరావు, పాత్రపిల్లి సునీల్‌కుమార్, ఎల్. కుమార్, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా మినీ బాలోత్సవం



లఘు నాటికలో బాలబాలికలు

దాబాగార్డెన్స్: వీసీసీ–ఆసరా మినీ బాలోత్సవం గురువారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఉల్లాసంగా సాగింది. ఆసరా వార్షిక సమావేశంలో భాగంగా బాలోత్సవం నిర్వహించారు. బాలోత్సవం ప్రెసిడెంట్ పిల్లల మర్రి రఘు, రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ వినయ్‌గాంధీ, ఆసరా చారిటబుల్ సొసైటీ సభ్యులు సుధ, శోభ, సంజయ్, డాక్టర్ కె. రమాప్రభ, కార్యక్రమ కన్వీనర్ సుశీల పాల్గొని ప్రారంభించారు. చదువుతో పాటు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. నిత్యం చదువుల ఒత్తిడి నుంచి అందిరికీ ఇది ఒక ఆటవిడుపుగా ఉంటుందని, అలాగే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు అవకాశం కల్పించినట్టవుతుందన్నారు. ఆసరా–వీసీసీ గత పదేళ్లుగా బాలల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తుందన్నారు. వీసీసీ క్లబ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్, క్లబ్స్ విద్యార్థులు సుమారుగా 500 మంది ఎల్‌కేజీ నుంచి పదో తరగతి పిల్లలు పాల్గొన్నారు. చిత్రలేఖనం, కథ చెప్పడం, మెమరీ టెస్ట్, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, బృంద గానం, జానపద బృంద నృత్యం, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, వ్యాస రచన, క్విజ్ వివిధ కేటగిరీల్లో 13 రకాల పోటీలు, 21 ఈవెంట్స్ నిర్వహించారు. దండు నాగేశ్వరరావు బృందం జడ్జిలుగా వ్యవహరించారు. సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రారంభ కార్యక్రమంలో వీసీసీ కన్వీనర్లు డి. శైలజ, మణి, అరుణ, స్వర్ణలత, సరోజిని, సంధ్య, వర్షిణి, విజయలక్ష్మి, లీలావతి, దీపిక, నీలవేణి, గుణ శంకర్, సతీష్, శశికుమార్, అప్పారావు, నిఖిల్, శ్రావణి, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

అల్లిపురం: ప్రేమించిన వ్యక్తి మందలించాడని బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ యర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం కల్లుపాకలకు చెందన బాలిక (17) స్థానికంగా ఒక దుకాణంలో పని చేస్తోంది. ఈమె గత రెండు సంవత్సరాలు పూర్ణామార్కెట్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడిని ప్రేమిస్తోంది. బాలిక మైనర్ కావటంతో ఇరు కుటుంబాల పెద్దలు ఆమె మేజర్ అయిన తర్వాత పెళ్లి చేసేందుకు నిర్ణయించారు. బుధవారం ఆమె కేటరింగ్ పనిపై బయటికి వెళ్లింది. ఆ సమయంలో ప్రవీణ్ పలుమార్లు ఫోన్ చేసినా ఆమె లిఫ్ట్ చేయలేదు. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత ప్రవీణ్ ఆమెను మందలించాడు. అంతలో బాలిక తల్లి వారిని వారించింది. ఈ నేపథ్యంలో బాలిక అక్కడి నుంచి వెళ్లిపోయింది. తల్లి తలుపు కొట్టినా తీయక పోవటంతో స్థానికుల సహాయంతో తలుపులు విరగ్గొట్టి చూసే సరికి బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉంది. ఆమెను కిందకి దించి చూసేటప్పటికే ఆమె ప్రాణాలు విడిచింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు బీచ్ కబడ్డీ పోటీలకు విశాఖ జట్ల ఎంపిక

ఎంవీపీకాలనీ: రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లాల పురుషులు, మహిళల జట్లను ఈ నెల 26న ఎంపిక చేయనున్నట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆర్కే బీచ్ వేదికగా ఈ జట్లు ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన జట్లు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడ బీచ్‌లో జరిగే 12వ రాష్ట్ర అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. వివరాలకు 96666 55355, నంబర్‌లో సంప్రదించాలన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులోని కోర్టు–2లో గురువారం పైడిరాజు మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. గ్రౌండ్‌లో ఉన్న వారే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 15 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. గురువారం ఉదయం, సాయంత్రం ఈ పోటీల్లో పాల్గొన్న జట్లకు లీగ్ మ్యాచ్‌లు ఆడించామని, శుక్రవారం ఉదయం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలను అందజేస్తామని నిర్వాహకులు పల్లా శ్రీను, పల్లా శివ తదితరులు తెలిపారు.